క్లుప్తంగా

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

ఆగస్టు 3న సర్వసభ్య సమావేశం

పాములపాడు: ఆగస్టు 3న ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు సంతగేటు బహిరంగ వేలంపాట

పాములపాడు: మండల కేంద్రంలోని సంతగేటుకు మంగళవారం ఆయుర్వేద వైద్యశాల వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచు మేకల భాగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు రూ.500 డిపాజిట్ చెల్లించాలన్నారు.

స్మార్ట్‌మీటర్లపై 30న పోరుబాట

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ఈనెల 30న చేపట్టే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం పోరుబాటపై పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్వరమే స్మార్ట్‌మీటర్ల బిగింపును ఆపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సుధాకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

చారు మజుందార్‌కు ఘన నివాళి



చారు మజుందార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: నక్సల్బరీ విప్లవ ఉద్యమ నేత చారు మజుందార్ సేవలు మరవలేనివని సీపీఐ(ఎంఎల్)జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న వాల్మీకి నగర్‌లో అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. వర్ధంతిని పురస్కరించుకుని చారు మజుందార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, స్వామన్న, గాబ్రియేల్, భాస్కర్‌గౌడ్, మహబూబ్‌బాషా, నరసింహులు, రాజు, అంకన్న, సుధాకర్, బీబీ, లక్ష్మీదేవి, గీతాంజలి, నాగమ ణి, ముర్తుజాబి, మద్దమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

గాజుల వితరణ



ఏఈఓ మధు, అర్చకులకు గాజులు అందిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీ దేవి అమ్మవారికి నంద్యాలకు చెందిన వెంకటసుబ్బమ్మ, శ్రీలక్ష్మీ, సూర్యకళ, రాజ్యలక్ష్మి మిత్ర బృందం రూ.10 వేల విలువైన గాజులు విరాళమిచ్చారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ముఖ్య అర్చకులు రాజమాణిక్య శర్మ, అర్చకులు లంకా పూర్ణానంద శర్మ, మూలస్థానం సుబ్బయ్య శర్మ ఉన్నారు.

కుందూపరివాహక ప్రాంతాల్లో వరదలను నివారించాలి

నంద్యాల(అర్బన్): కుందూనది పరివాహక ప్రాంతంలో వరదలను నివారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని వినియోగించుకునే నిర్మాణాలు పూర్తిచేయకపోవడం, నిర్వహణ పట్ల పాలకుల నిర్లక్ష్యం సీమ పాలిట శాపంగా మారిందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం 22 రోజుల క్రితం మొదలు పెట్టి నేడు 31వేల క్యూసెక్కుల స్థాయికి పెంచారన్నారు. ఈ రోజు కూడా గండికోట, మైలవరం, బ్రహ్మసాగర్ రిజర్వాయర్లకు చుక్కనీరు అందడం లేదన్నారు. సీమ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి రిజర్వాయర్లకు 30 టీఎంసీల నీటిని కూడా తరలించలేకపోయారన్నారు. ఇప్పటికైనా రాయలసీమ అభివృద్ధి పట్ల పాలకులు నిజాయితీతో వ్యవహరించాలన్నారు.

రైతన్న పడిగాపులు

- యూరియా కోసం తప్పని గంటల తరబడి నిరీక్షణ
- పైర్లను బతికించుకునేందుకు.. రైతన్న తిప్పలు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని నాగంపల్లి సొసైటీ వద్దకు యూరియా లోడు వస్తుందని తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ఉదయం నుంచి క్యూకట్టారు. గువ్వలకుంట్ల, జి.వీరాపురం, ఎం.లింగాపురం, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు అన్నం, నీళ్లు మానేసి యూరియా కోసం క్యూలో నిలుచొని గంటల తరబడి వేచిచూశారు. ఒక్క బస్తా అయినా దొరకకపోతుందా అనే ఆశతో సాయంత్రం వరకు ఉన్నారు. అయినా కొందరికే యూరియా అందడంతో మిగతా వారు చేసేదేమీ లేక వెనుదిరిగారు.



యూరియా కోసం వేచిచూస్తున్న రైతన్నలు

పైర్లను బతికించుకునేందుకు..

మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సుమారు 3,500 హెక్టార్ల దాకా రైతన్నలు మొక్కజొన్న పంటలను సాగుచేసుకున్నారు. ఈ పంటతో పాటు 900 హెక్టార్ల దాకా రెండో పంటగా వరిని సాగుచేసుకున్నారు. మొదట్లో వర్షాలు పడక మొక్కజొన్న పంటలు ఎండుముఖం పట్టాయి. నాలుగురోజుల క్రితమే వర్షాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో పైర్లకు ఎరువుతు అత్యంత అవసరం. కానీ ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడంతోనే ఎరువులు సరిపోయేటంత నిల్వలు అందజేయలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రైవేట్ దుకాణాల నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టిస్తూ అధికధరలకు, అనవసర మందులు అంటగడుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ తప్పును కప్పించుకునేందుకు అధికారులు మాత్రం సరిపోయేంత యూరియా ఉందని ప్రకటనలు జారీ చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు.

నాయకులకేనా..?



నేను 14 ఎకరాలలో మొక్కజొన్న వేసుకున్నా. పంట ఏపుగా పెరిగి కంకి బాగా రావాలంటే ఈ సమయంలో యూరియా తప్పకుండా వేయాలి. వారం రోజుల నుంచి యూరియా కోసం ఆర్‌ఎస్‌కే చుట్టూ తిరిగి అలసి పోయినా. ఇక్కడికి యూరియా లోడు వచ్చిందని తెలిసి వచ్చిన. ఉదయం 7 గంటల నుంచి కూర్చున్న. ఒక్క బస్తా కూడా దొరకలేదు. నాయకులకు మాత్రమే యూరియా దొరుకుతుంది. మాలాంటి రైతులకు మాత్రం దొరకడంలేదు.

– శీలం రాముడు, రైతు, కొత్తపల్లి గ్రామం

సిద్ధాపురం చెరువు నుంచి సాగునీరు విడుదల

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నుంచి సిద్ధాపురం చెరువుకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సోమవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు అందించడం ద్వారా ఈ ప్రాంతంలో వరి పంటను రెండు, మూడు సార్లు పండించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఫేజ్–2 పంపుసెట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కనీస వేతనాలు మంజూరు చేయాలి

ఆత్మకూరు: ఆశావర్కర్లకు కనీస వేతనాలను మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు పని ఒత్తిడి ఎక్కువైందన్నారు. ప్రత్యేక అలవెన్సులు, సెలవులను మంజూరు చేయాలని, ప్రతి ఆశావర్కర్‌కు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. అంతకుముందు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా శాంతి, ఉపాధ్యక్షులుగా వరలక్ష్మి, యశోద, ప్రధానకార్యదర్శిగా భారతి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మిబాయి, సులోచన, కోశాధికారిగా సామక్క, సభ్యులుగా సంతోషమ్మ, ముంతాజ్, జయలక్ష్మి, జానకి ఎన్నుకున్నారు.

కూటమి నేతలను నిలదీయాలి

ఆత్మకూరు: తొలి అడుగు పేరుతో గ్రామాలకు వచ్చే కూటమి నేతలను సూపర్ సిక్స్ హామీలపై నిలదీయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలోని గరీబ్‌నగర్ కాలనీలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వర రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం కూటమి నేతలు ఎన్నికల సమయంలో తప్పుడు హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందన్నారు. ఉచిత బస్, మూడు సిలిండర్ల గ్యాస్, అన్నదాత సుఖీభవ, మహిళలకు రూ.1,500 అంటూ మభ్యపెట్టిన నాయకులు ఇప్పుడు గ్రామాలకు ఏ మొఖం పెట్టుకుని వస్తున్నారో ఎక్కడికక్కడే ప్రశ్నించాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చిన్నచిన్న అసమ్మతులున్నా పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని భువనేశ్వరరెడ్డి కార్యకర్తలకు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

సూచించారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అన్నిరంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని, వారి తరపున నిలబడి ఎప్పటికప్పుడు వ్యతిరేక పాలనను ఎండగట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, వార్డు కౌన్సిలర్ సభ్యులు విజయ్‌చౌదరి, పార్వతి, ఆంజనేయులు, జయకృష్ణ, వెంకటస్వామిగౌడ్, మోమిన్‌మున్నీర్‌బాషా, విజయ్, కలీముల్లా, దర్గమ్మ, పార్వతి, నాగరాజు, ముస్తఫా తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, రాజేష్, సురేష్, రమేష్, మహేష్, రవణమ్మ, దర్గప్ప, షఫీవుస్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

శ్రీశైలంటెంపుల్: శ్రావణ శుద్ధ చవితిని పురస్కరించుకుని సోమవారం పలువురు భక్తులు శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు నాగులకట్ట వద్దకు చేరుకుని పత్తితో చేసిన వస్త్రం, యజ్ఞోపవీతం, పలురకాల పుష్పాలతో నాగమూర్తులను అలంకరించి, పాలతో అభిషేకించారు. అనంతరం నువ్వుల పిండి, చలిమిడి, వడపప్పులను నివేదించారు.

● **పాములపాడు:** నాగుల చవితి పండుగను సోమవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పుట్టల వద్ద, నాగుల కట్టల వద్ద భక్తులు పాలు పోసి, పసుపు, కుంకుమలతో నాగ ప్రతిమలకు తిలకం దిద్ది, ప్రదక్షిణలు చేసి దర్శించుకున్నారు. ఇష్టమైన పిండివంటకాలు, నువ్వుల ముద్దలు, చలువ పిండి, పెసర పప్పు నైవేద్యాలుగా సమర్పించారు. నోము ఉన్న వారు నోము ధారాలు ధరించారు.

● **మహానంది:** మహానంది క్షేత్రంలో నాగులచవితి పురస్కరించుకుని భక్తులు నాగుల కట్ట వద్ద ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహిళలు ఉదయం నుంచే పుట్టలు, నాగులకట్ట వద్దకు చేరుకుని నాగ దేవతలకు పట్టు వస్త్రాలు సమర్పించి నైవేద్యం పెట్టారు.



శ్రీశైలంలోని నాగులకట్ట వద్ద పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

● **జూపాడుబంగ్లా:** నాగపంచమిని పురస్కరించుకుని తాటిపాడు, జూపాడుబంగ్లా, మండ్లెం, తర్తూరు, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం, పోతులపాడు, తదితర గ్రామాల్లోని నాగదేవతల విగ్రహాలు, పుట్టలకు భక్తులు పాలు పోసి పూజలు నిర్వహించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జూపాడుబంగ్లా: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 ఏళ్లు నిండిన తాపీవర్కర్లకు పింఛన్, ఉచిత ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, భవననిర్మాణ కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు అందజేశారు.

ఏపీ ఎన్జీఓ నేత వెంగళ్‌రెడ్డిపై నేడు విచారణ

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డిపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణమ్మ మంగళవారం విచారణ జరపనున్నారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌లో ఉపాధ్యక్షుడిగా ఉన్న సాంబ శివారెడ్డి పలు ఆరోపణలతో వెంగళ్ రెడ్డిపై జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో వెంగళ్ రెడ్డికి ఇటీవల నోటీసులు కూడా జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం విచారణకు హాజరుకావాలని డీఆర్వో ఆదేశించినట్లు సమాచారం.

పంచమఠాలలో విశేష పూజలు



పంచమఠాలలోని స్వామివారికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకర మఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు పాల్గొన్నారు.

గువ్వలకుంట్లలో వైద్యశిబిరం





వైద్యశిబిరంలో రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది,కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ అధికారులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ ఎస్సీ కాలనీలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మహమ్మద్ బేగ్, వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. 26 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా కాలనీ పరిసరాలను శుభ్రం చేయించారు. దోమలు నివారణ మందును పిచికారీ చేయించారు. వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమతంగా ఉండాలని వైద్యాధికారి మహమ్మద్ బేగ్ సూచించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, చలి, జలుబు, దగ్గు తదితర లక్షణాలు తగ్గకపోతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు.

కాలనీని సందర్శించిన డిప్యూటీ ఎంపీడీఓ

ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు చిన్నస్వామి, పార్థసారథితో కలిసి గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీని సందర్శించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు.

ఇలా ఉంటే.. ఎలా వెళ్లాలి?

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా తంగడంచ ఫారానికి వెళ్లేదారిలో లోతట్టులో అండర్‌పాస్ వంతెనను నిర్మించారు. చిన్నపాటివర్షం కురిసినా అండర్‌పాస్ వంతెన కింద వర్షం నీరు, రైతులు పొలాలకు పెట్టుకునే నీరు చేరి మోకాళ్ల లోతు మేర నిల్వ ఉంటున్నాయి. కాంట్రాక్టర్లు రోడ్డుకంటే ఎత్తుగా అండర్‌పాస్ వంతెన నిర్మించాల్సి ఉండగా రోడ్డుకంటే మూడు అడుగుల లోతు అండర్‌పాస్ వంతెన నిర్మించారు. దీనికి తోడు అండర్‌పాస్ కింద నిలిచిన వర్షం నీరు, సాగు నీరు బయటకు వెళ్లేమార్గం ఏర్పాటు చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా, రైతులు పొలాలకు పెట్టుకునే సాగునీరు వచ్చి అండర్‌పాస్ వంతెన కింద నిలిచిపోతుండటంతో తంగడంచ ఫారానికి అధికారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రైతులు, వ్యవసాయ



కూలీలు బైక్‌లపై, ఎద్దుల బండ్లపై, నడుచుకుంటూ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారు. హైవే రోడ్డు నిర్మాణ పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకొని తంగడంచ ఫారానికి వెళ్లే మార్గంలోని అండర్‌పాస్‌కింద నీటినిల్వలేకుండా చేయాలని ఫారం అధికారులు, రైతులు కోరుతున్నారు. లేని ఎడల ఆందోళనచేపడతామని పేర్కొంటున్నారు.

మల్లన్న సేవలో రిటైర్డ్ విజిలెన్స్ కమిషనర్



శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న రిటైర్డ్ విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునీత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రిటైర్డ్ విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునీత దంపతులు దర్శించుకున్నారు. సోమవారం వేకువజామున ఆలయం వద్దకు విచ్చేసిన వీరికి ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనిల్ చంద్ర పునీత దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను ఈఓ అందించి సత్కరించారు.

అభ్యంతరాలుంటే తెలపండి

కొత్తపల్లి: భూ రీసర్వేపై ఎటువంటి అభ్యంతరాలున్నా రెవెన్యూ అధికారులకు తెలపాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం బట్టువారిపల్లె గ్రామంలో డ్రాఫ్టల్యాండ్ రిజిష్టర్‌పై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన 1,020 ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు. ఇందులో 9.00 ఎకరాలు ఎస్ఎస్‌పీ భూములు, 120 ఎకరాలు రైతుల పట్టా భూములన్నాయన్నారు. ఇప్పటికి 70 మంది భూములను సర్వే చేశామని, వీటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే అర్జీ అందజేయాలని ఆమె సూచించారు. సమావేశంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమారాణి

బదిలీ ఎంఈఓకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఎంఈఓ బాలాజీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: బదిలీపై వెళ్తున్న ఎంఈఓ బాలాజీ నాయక్‌ను సోమవారం విద్యాశాఖ మండల కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన మేరీ మార్గరేట్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్, వార్డు కౌన్సిలర్ రాజగోపాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు చాంద్‌బాషా, ఇబ్రహీం, జనార్దన్, నూర్‌అహ్మద్, హుసేన్‌సాహెబ్, రాంబాలాజీనాయక్, హనుమంతునాయక్, అమీర్, చంద్రశేఖర్, హనుమంతు, సీఆర్పీలు ఈశ్వర్‌నాయక్, ఉసేన్, ఖాజామహ్మద్, రమాదేవి, ఖాజా పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ

బండిఆత్మకూరు: మండలంలోని ప్రభాత్ జూనియర్ కళాశాలలో నాయకత్వ లక్షణాలపై ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీస ర్ మాధవీలత హాజరై హెచ్‌ఎంలకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు యశోద, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నివేదన



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన దుర్గా నృత్య కళానిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. గణపతికౌత్వం, మూషికవాహన, తాండవనృత్యం, ఓం నమశ్శివాయా, శివతాండవం తదితర గీతాలకు వైష్ణవి, దిత్యశ్రీ, సౌమ్య తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

శాంతినగరమా.. శాంతినిలయమా?



పాములపాడు మండలంలో శాంతినిలయం గ్రామం ఉంది. అయితే నేషనల్‌హైవే 340 సీ సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామం పేరు శాంతినగర్ అంటూ తప్పుగా చూపుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డును చూసిన శాంతినిలయం గ్రామస్తులు నవ్వుకుంటుండగా.. శాంతి నిలయం గ్రామానికి బంధుత్వమున్న వారు, ఇతర పనులపై శాంతినిలయం గ్రామానికి వెళ్లాలని వచ్చినవారు బోర్డును చూసి కాసేపు ఆలోచనలో పడుతున్నారు. స్థానికుల నుంచి క్లారిటీ తీసుకుని గ్రామానికి చేరుకుంటున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి గ్రామం పేరు సరిచేస్తారో.. చెవిటివాడి ముందు శంఖం ఊదిన మాదిరిగా వదిలేస్తారో వేచి చూడాలి.

– పాములపాడు

ఆర్టీసీ ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: ఆర్టీసీ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించినా, దాడికి యత్నించినా, విధులకు ఆటంకం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజు హెచ్చరించారు. సోమవారం ఆర్టీసీ డిపోలో సెక్షన్ల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దుర్భాషలాడినా, విధులకు ఆటంకం కలిగించినా చర్యలు ఉంటాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రత గురించి ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిపో సెక్రటరీ సురేష్, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బీజే రాబర్ట్, ఎన్ఎంయూ డిపో సెక్రటరీ వెంకటరత్నం, సీనియర్ నాయకులు రామస్వామి, జనార్దన్, సుధాకర్, నాయక్, వెంకటయ్య పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజు, నాయకులు

ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

నందికొట్కూరు: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు ఎ.శోభారాణి అన్నారు. సోమవారం సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ముద్దాయిలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వసతులు, భోజనం, వైద్య సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 70 ఏళ్ల వయస్సు పైబడిన ముద్దాయిలకు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ప్రత్యేకమైన వైద్య సదుపాయలను న్యాయ సేవల ద్వారా పొందవచ్చన్నారు. అనంతరం 60 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. సబ్‌జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, న్యాయవాది వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి

టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచు గిరిజనులకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేయాలని కొమరంభీం గిరిజన సంఘం నాయకులు వై.ఆశీర్వాదం సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో శ్రీశైలం ఐటీడీఏ పీఓ కె.వెంకట శివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అన్ని గూడేలలో ఇప్పటికే నిర్మించి ఉన్న ఇళ్ల స్లాబులు కారుతున్నాయని, గుడిసెలు కూడా వర్షానికి కారుతున్నయని తాత్కాలిక ఉపశనం కోసం టార్పాలిన్ పట్టాలను ఇవ్వాలని, ఉపాధి కోసం మేకలు, గొర్రెలు, బర్రెలు ఇచ్చి చెంచులను ఆదుకోవాలని ఆయన కోరారు. పీఓను కలిసిన వారిలో గిరిజనలు కుడుముల వెంకటేశం, గురవయ్య, మల్లీశ్వరి, శాంతమ్మ, బయమ్మ, వీరమ్మ, లింగమ్మ, లక్ష్మి, సువార్త, వెంకటమ్మ, పోతమ్మ, నాయక్ తదితరులు ఉన్నారు.

భువనేశ్వర్‌రెడ్డిని కలిసిన మైనార్టీ నాయకులు

ఆత్మకూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర సెక్రటరీగా నియమితులైన మోమిన్‌మునీర్‌బాషా సోమవారం పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు స్థానం కల్పించిన పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, హాజీషేక్, బైరాపురం మహబూబ్‌బాషా, టైగర్ బాబు, మోమిన్ ఇస్సు, రాజమద్ గారి ఇబ్రహీం, ముసలమడుగు రసూల్, బెజ్జం నవీసా పాల్గొన్నారు.